
*ఛాయిస్ లేదా ఎంపిక అనేది సార్త్రే విస్తృత తాత్త్విక చింతనలో ఒక భాగం. ఛాయిస్‌కి మాత్రమే ఆలోచన పరిమితి చేసుకుంటే ముళ్లకంపలో పడతాం. ఈ జీవితంలో గందోళన (గందరగోళం+ఆందోళన)  ఒక అనివార్య మానసిక స్థితి. నీదనుకుంటున్న లేదా నువ్వు నిర్మించుకున్నావనుకున్న జీవితం నీ ఛాయిస్ కాదని, అది కేవలం నువ్వు ఇష్టంగానో అనిష్టంగానో అంగీకరించవలసి వచ్చిందనే స్పృహ కలిగినప్పుడు కలిగే బాధ గందోళన. ఈ కథలో మోకాళ్ల నొప్పి మెటఫర్ మాత్రమే.*

తల్లావఝ్ఝల పతంజలిశాస్త్రి

# 5

# అతని శీతువు



తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

## 5 అతని శీతువు



లెక్కలేనన్ని ఎలకపళ్లతో మెత్తగా దూకింది చలికాలం. తలుపు పక్కనో, గుమ్మం పక్కనో, గోడ మీదో పడుకుని నిశ్శబ్దంగా ఇంట్లోకి దూకిన తెల్లపిల్లిలా. కుర్చీలోంచి తలుపు ఊచల అవతలి ఉదయాన్ని మరోసారి చూశాడు వరదాచార్యులుగారు. భుజంమీద వంగపండు రంగు శాలువా సవరించుకుని, లుంగీ మోకాళ్లపైకి లాక్కుని, కాళ్లు చిన్నపీట మీద పెట్టుకుని నిస్సహాయంగా నారాయణమూర్తిని తల్చుకున్నారాయన.

ఎండ వెచ్చగా మోకాళ్ల మీద పడుతోంది. ('ఆహా నారాయణ మూర్తీ నాయనా') ఇంకెంతసేపు. మరో పావుగంటలో ఎండ కొత్త బ్లేడులా మోకాళ్ల మీద పడి చురుక్కుమంటుంది. కుర్చీ పక్కనే ఆయన లాగే చల్లబడిపోయి కూచుంది కాఫీగ్లాసు. మరికొంచెం వెచ్చటి కాఫీ కావాలనిపించింది ఆయనకి. వరదగారి భార్య డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని మెల్లిగా మోకాళ్లు ఒత్తుకుంటోంది. ('ఈ దిక్కుమాలిన పాట్లేవిటో') లేచి వెళ్లి స్నానం చేసి వంటపని చేసుకోవాలని ఆమె మనసు అంటున్నా మోకాళ్లు మొరాయిస్తున్నాయి. వంటింట్లోంచి హాల్లోకి నడిచేసరికి నరకమే. నారాయణమూర్తే కనిపిస్తున్నారామెకు.

"ఇదుగో," పిలిచాడు వరదాచార్యులుగారు.

మోకాళ్లు ఒత్తుకుంటూ వరదగారి గదివైపు చూసిందామె. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మోకాళ్లు ఒత్తుకుంటోందని తెలుసాయనకి.

"ఊ అనవేవే? వినబడ్డం లేదా ఏం ఖర్మ?"

"అదొక్కటే తక్కువ."

"ఊ అనొచ్చుగా. కొంచెం కాఫీ. వేడిగా ఉండాలి. సోడాలా గాదు."

"సోడాలాగే పుచ్చుకుంటున్నారు గావును. వేడి మసుళ్లు."

"కాఫీ పట్రా. నీ అరవ కోడలి దగ్గర కాఫీ చెయ్యడం నేర్చుకో మంటే వినవు."

"అదొక్కటే తక్కువ నాకు. పోనీ మీరే వెళ్లి అక్కడుండండి."

"కదిలిస్తే చాలు నస."

"మీరే కాదు. నేనూ లేవలేను. దిక్కుమాలిన కాళ్లు, లేవలేను. కూచోలేను."

"న్యూసెన్సు."

టేబుల్ అంచుమీద చేతులు వేసుకుని మెల్లిగా లేచిందామె. ఒక కోడలు బెంగళూరు, మరొకామె ఢిల్లీ, కూతురు టెక్సాస్. కూచోపెట్టి ఎవరైనా చేసిపెడితే బావుండుననిపించిందామెకి. మంచం దిగ్గానే ఉదయం, అలా గాలిలో తేలిపోయి బాత్రూంకీ, అలాగే వంటింట్లోకి వెళ్లాలనిపిస్తుందామెకి. మరో అడుగువేసి టేబుల్ మీది ఖాళీ గిన్నె అందుకుని మరో అడుగు వేసింది. మూడో అడుగు కూడా కుర్చీ పట్టుకుని వేస్తుండగా చేతిలో గిన్నె జారి నేలమీద పడి భళ్లుమంది.

"ఏవిటే అదీ?"

"ఏవీలేదు. గిన్నె చేజారిపోయింది."

వరదాచార్యులు గుండె కలుక్కుమంది. పడిన గిన్నె అతని నెత్తి మీద పడింది. చేజారిపోవటం ఏవిటి? ఆమె ఏం పడేసినా అదే అంటుంది. ఎప్పుడు విన్నా అతని గుండె గతుక్కుమంటుంది. బూటుకాలితో వెనకభాగంమీద తన్నినట్టుంది. చేజారింది. ఆ మాట ఎప్పుడు విన్నా అతనికి చిత్రమైన భయం. దడదడల్లాడుతుంది గుండె. సామూహిక మానభంగం అని చదివినా వరదకి అలాగే ఉంటుంది.

కుదుటపడి మోకాళ్లవైపు చూసుకున్నాడతను. మోకాళ్లమీద వెచ్చటి వెండి శాలువా లాంటి ఎండ. కుంపటి వేడెక్కినట్టు చుర్రుమంది. లుంగీ మోకాళ్ల మీదికి లాక్కుని కూచునే కుర్చీని కొంచెం వెనక్కి తోసుకున్నాడు వరదగారు. కాఫీ ఏదీ? మళ్లీ ఓసారి పేపరు చూద్దామనిపించి అసంకల్పితంగా లేవబోయాడాయన. కుడి మోకాలు ఎక్కువగా, ఎడమకాలు తక్కువగా కరేలుమన్నాయి. అబ్బా! అని కూచుండిపోయాడతను.

"వరదగారూ అంతేసార్ అది. మెషిన్‌లాగే దానికీ అరుగుదల ఉంటుంది. మోకాళ్లు అరిగిపోయాయి. మరీ నడవలేని స్థితివస్తే ఆపరేషన్ చేద్దాం."

"తప్పదంటారా?"

"చూదాం."

"ఒంటిమీద ఇంతవరకు కత్తి పడలేదు."

పెద్దగా నవ్వేశాడు డాక్టరు.

"గుండెకాయ తీసి అవతలపారేసి కొత్తది పెడుతున్నాం. మీరు మోకాలిచిప్పల గురించి బాధపడుతున్నారు. ఏ లోకంలో ఉన్నారు స్వామీ?"

వరదగారు గుండెమీద చెయ్యి వేసుకున్నాడు.

"ఇదో కాఫీ. ప్చ్! భగవంతుడా... మళ్లీ మళ్లీ ఊరికే పిలవకండి," గదమాయించినట్టందామె.

వెనక్కి తిరిగి, కాలుతున్న స్టీలుగ్లాసు జాగ్రత్తగా పట్టుకుని కాఫీ చప్పరించాడు వరదగారు. ఈ ఉదయం, కాఫీ గ్లాసూ, శీతువూ, మూడు తన చేతిలో లేవు. పేపరు డైనింగ్ టేబుల్ మీద ఉంది. అక్కడ పడేశాడతను. చంకలో పెట్టుకుని రావలసింది. అక్కడివరకు ఎట్లా వెళ్లడం? కావలసిన వస్తువులు దూరంగా ఉంటే ఇదే ఇబ్బంది. ఇంట్లో చిన్నచిన్న పనులు చెయ్యడానికి కుర్రవాణ్ణి పెట్టుకుంటే సుఖంగా ఉంటుంది. హాల్లో డైనింగ్ టేబులికీ అతనికీ మధ్య దూరం పెరిగినట్టనిపించింది. నిస్సహాయంగా చూశాడతను. ఈ దూరం నిజం కాదు వాస్తవం. మేజిక్ నేర్చుకుంటే బాగుండును. దూరంలో ఉన్న వస్తువుల్ని దగ్గరకు రప్పించడం, లైటు వెయ్యడం, ఆపడం... మేజిక్ వల్ల ఎన్ని లాభాలో! ఇంకా నయం, బ్యాంక్‌లో పని చేస్తున్నప్పుడు వచ్చిందికాదీ రోగం. రిటైరవగానే చూడ్డానికి వచ్చినట్టు వచ్చింది. కాఫీ చప్పరిస్తూ ఎండవైపు చూశాడతను. శీతాకాలం ఇష్టం తనకి. వర్షాలు బాగుంటాయి కానీ, చికాకు, చీదర. మన రోడ్లు పడవలకి అనువుగా ఉంటాయి. వల్లి బలవంతంగా రెండు నెలలు టెక్సాస్ తీసికెళ్లింది. శుభ్రమైన రోడ్లేగానీ ఎక్కువకాలం ఉండబుద్ధి కాలేదు. ఉదయం దానవాయిపేటలో దిగ్గానే సాయంత్రం పార్కుకి వెళ్లి స్నేహితులతో మాట్లాడుతూ ఇండియా కూడా అమెరికాలా ఉంటే బావుండునన్నాడు వరద.

కాలేజీలో పనిచేసి రిటైరైన స్వామిగారన్నాడు, ''ప్రపంచం మనం ఎలా కావాలనుకుంటే అలా ఉండదు.''

''మరెలా ఉంటుంది?''

''అదెలా ఉంటుందో అలాగే ఉంటుంది సార్. మార్పు కూడా మనకోసం జరగదు.''

''మరెలా ఉంటుంది?''

''ఎలాగూ ఉండదు. మనందరికీ తలో ప్రపంచం ఉంటుంది. అది మనకి తెలియాలి. మార్పు గురించి కాదు. జీవితాన్ని మనం ఎలా చూస్తే అలా ఉంటుంది. మీరూ నేనూ కవిత్వాన్ని ఒకేలా చూడాలని లేదు.''

''స్వామిగారూ, రోజూ విష్ణుసహస్రనామం చదవటం మానకు, జీవితం బావుంటుందనేవాడు మా నాన్నగారు. నేను చదివాను. నా నోటికొచ్చింది. మరి ఆ సుఖం ఏవిటో మాత్రం నాకు తెలీడంలేదు.''

''మీ నాన్నగారు రైటు. విష్ణుసహస్రనామం చదివితే జీవితం బాగుపడదు. జీవితంపట్ల మన దృక్పథం మారుతుంది. ఆయన ఉద్దేశం అదే. పైగా జీవితం మీకోసం పెసరట్టు ఉప్మాలా తయారుకాదు. మీకీపాటికి తెలిసే ఉండాలి. అయినా ఆచార్లుగారూ, బ్యాంకు మేనేజరు చేశారు గదా, మీకేంటి చెప్పండి.''

''బ్యాంకులో చేస్తే సుఖంగా ఉండాలని రూలుందా?''

“అనుకునేగదా చేరారు?”

“లేదు. నాన్నగారి బలవంతం మీద చేరేను. నా ఇష్టంతో నిమిత్తం లేదు.”

“ఇష్టం వేరు. కోరుకోవడం వేరు. గట్టి నిర్ణయం వేరు.”

“ఇష్టానికి అర్థం లేదంటారా?”

“దేనికీ లేదు. ఇష్టానికీ లేదు. ఇష్టాన్ని మీరెట్లా అనుకుంటారో దాన్నిబట్టి అర్థం మారుతుంది.”

తరువాత రోజూలాగే స్వామిగారు అతన్ని స్కూటరుమీద ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్లాడు. రోడ్డుమీద నడవకుండా కూచునే వెడుతుంటే బావుంది. మట్టిలోంచి, నీళ్లలోంచీ, మురికిలోంచి కాళ్లకి తగలకుండా స్వామిగారు తీసుకెళ్తుంటే హాయిగా ఉంటుంది. ఇంటి దగ్గర దిగ్గానే అనిపించింది, సుఖంగా ఉండడానికి మన ప్రమేయం లేకుండా ఉంటే బాగుండునని.

మళ్లీ డైనింగ్ టేబుల్ మీదున్న పేపరువైపు చూశాడతను. దాన్ని చూస్తున్నకొద్దీ మళ్లీ ఓసారి తిరిగేద్దామనిపిస్తోంది. సాధ్యమైనంత వరకు కదలకుండా కూచున్నంత సుఖం లేస్తే ఉండదు. ఎండ వరదగార్ని వదిలేసి పైకి వెళ్లిపోయింది. కళ్లు మూసుకుని అలాగే కూచుండిపోయాడాయన. బయట ఉదయం హడావుడిలో ఉంది రాజమండ్రి. రాష్ట్రం, దేశం అన్ని గ్రహాలు దేని వ్యాపకంలో అవి మోకాళ్ల నొప్పులు లేకుండా ఉన్నాయి. ఈ సృష్టిని మోకాళ్ల నొప్పులు నియంత్రించడం లేదు. అసలీ మోకాళ్ల నొప్పుల కంటే ఏదో చిన్న గుండెపోటు వచ్చి తగ్గితే ఏంపోయింది. వెంటనే పదిరోజుల్లో నడుచుకుంటూ ఎక్కడికైనా పోవచ్చు. కొంచెం ఊపిరితిత్తులుగానీ, ఉదర సంబంధమైన రోగం వచ్చినా మహా అయితే నెలరోజులు. మళ్లీ మామూలు మనిషై సరదాగా ఒకసారి బ్రాంచికి వెళ్లి కబుర్లు చెప్పుకుని రావొచ్చు. కాళ్లు బారజాపి చిన్నమోకాళ్ల వ్యాయామం ఒకటి చేశాడాయన. మంచి ఉద్యోగి తను. కానీ బదిలీలు, ఒత్తిడులు, యూనియన్ వెధవ రాజకీయాలు పడేవికావు. విశ్రాంత జీవితం కోరుకునేవాడు. ఎందుకో తెలీదు. కుర్చీని ఇంకా ఇటువేపు తిప్పుకోవాలనిపించింది. కానీ లేవాలి. ఈ శీతాకాలం తనొక్కణ్ణే పొదివి పట్టుకుని మోకాళ్లు కొరుకుతోంది. ఇదేం లేనప్పుడు అతనికి కాశ్మీరు చూడాలని ఉండేది. ఇష్టపడేవాడు. అప్పటికి పిల్లలిద్దరూ గూడు వదిలి వెళ్లిపోయారు.

“మనం కాశ్మీరు వెడదాం.”

“కాశ్మీరా? ఎందుకు?”

“ఎందుకేవిటి, బావుంటుంది గనక. నా కిష్టం గనక.”

“శ్రీరంగం, కంచి అవీ చూద్దావని ఉండదు. ఎందుకూ రోజూ సహస్రనామాలు చదువుతారు మళ్లీ.”

"దీనికీ దానికీ సంబంధం లేదు."

భార్యతో జరిగిన సంభాషణలో అతను ఓడిపోయాడు.

అతను కాశ్మీర్ వెళ్లలేదు. శ్రీరంగంలో గుడికి వెళ్లి హోటలు గదికి వచ్చేరు.

"మీకసలు దేవుడి మీద ధ్యాసలేదు."

"నీకెలా తెలుసు?"

"మీ మొహం చూస్తే తెలీదా ఏమిటి? మనసు దేవుడి మీద ఉంటేగా."

'అదేవిటి, లేకపోవడం ఏమిటీ? తనకి ధ్యాసదేని మీద ఉందీ?' అని రాత్రి చాలాసేపు ఆలోచించినా తెలీలేదతనికి.

వరదాచార్యులు కుర్చీలోంచి లేచి, జాగ్రత్తగా నుంచుని లుంగీ ఎత్తిపట్టుకుని కుర్చీ కింది కాఫీగ్లాసు చూశాడతను. దాన్ని అలాగే చూస్తుండిపోయాడతను. వంగో కుండా చెయ్యిచాపి గ్లాసు వైపు ఎంత బెల్లించి చూసినా చేతిలోకి రాలేదు. ఐదు సంవత్సరాల పొడుగు నిట్టూర్పు సాయంతో వంగి గ్లాసు అందుకుని లేచాడు. గ్లాసు చేజారిపోదు గదా! చేజారిపోవడం అనుకోగానే అతని గుండె గుబగుబలాడింది. వరద డైనింగ్ టేబుల్ వైపు ప్రయాణిస్తుండగా వంటింట్లోంచి అందామె.

"ఇహనేనా స్నానం చేసి రండి."

తనకి తెలుసుగదా. టోకెన్ తీసుకున్న తరువాత డబ్బులివ్వాలి గదా. టేబుల్ మీదున్న పేపరు తీసుకుంటూ చివర ప్రశాంతంగా నీలంగా ఉన్న సీసా వైపు చూశా డతను. నెప్పులెక్కువనుకుంటే పూసుకోమన్నాడు ఆయుర్వేది. సుఖానికి పెట్టిన మూతలా ఉందది. పేపరు తీసుకుని గదిలో మంచంమీద పారేసి స్నానాలగదివైపు నడిచేడతను. చక్రాలబండి ఉన్నా బాగానే ఉంటుందనుకున్నాడు. చక్రాల బండ్లు రెండు కావాలి. ఉఫ్. అతి జాగ్రత్తగా స్నానాలగదిలోకి అడుగు పెట్టాడాయన. ('స్నానం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి సార్.')

దిండ్లు సౌకర్యంగా అమర్చుకుని నడుము వాల్చి పేపరు అందుకుని కళ్ల ముందు పరుచుకున్నాడు వరద. పేపరు పై అంచుమీంచి ఇద్దరూ గోడకి వేలాడుతూ కనిపించారు. పేపరుదించి గోడవైపు చూశాడతను. పెళ్లిఫొటో. (కాస్త గుడ్డముక్క తీసుకుని తుడుద్దావని కూడా ఉండదు) మెల్లిగా పలచగా గోడలోంచి మంచు మబ్బులు ఫొటో చుట్టూరా అల్లుకుంటున్నాయి. ఒంటి మీద చేతుల బనీను వేసుకున్నా వరదగారికి చలి అనిపించింది. మంచం చల్లబడింది. దుప్పటి గడ్డం వరకూ లాక్కుని ఫొటో కనబడకుండా పేపరు అడ్డు పెట్టుకున్నాడు. పెద్ద కప్పు పట్టుకుని సెరెనా విలియమ్స్ పెళ్లి ఫొటో చూస్తోంది. పేపరు చూస్తూనే అనుకోకుండా ఫొటోవైపు చూశాడతను.

"కాదురా. ఉద్యోగంలో జేరేవు. ఇంకెన్నాళ్లు? ఇప్పుడు చేసుకోనంటే ఎప్పుడు?"

"నే చెప్తాలేమ్మా. ఏం కొంప మునిగింది?"

"పిల్ల తండ్రి కొంప! ఏదో ఒక మాట చెప్పాలా వద్దా వాళ్లకి! కిళాంబి వాళ్లు. మనవాళ్లే. పిల్ల గూడా బాగానే ఉంటుంది."

"అమ్మా, నన్నొదిలెయ్యి. ఆ గోదాదేవిని మరోణ్ణి చూసుకోమను."

ఉద్యోగం రాగానే పెళ్లెందుకు చేసుకోడం? (కాస్త ఉడకేసి పెడుతుందిరా నాయనా) ఉద్యోగంలో చేరి అప్పటికి మూడేళ్లయింది. బెజవాడ. పేపరు కూడా మంచుకి చల్లబడినట్టనిపించింది. ఫొటో ఇప్పుడంత స్పష్టంగా లేదు. చాలారోజులు, నెలలు కిళాంబివారమ్మాయిని లాకర్లో పెట్టేడతను.

"ఫొటో పమ్మించారు. జాతకాలు కూడా అతికినట్టు సరిపోయాయి. ఏవంటావు?"

"ఏవీ అనను."

రాత్రి పడుకోబోయే ముందు రోజూ సుగుణ జ్ఞాపకం వస్తుంది. బావుంటుంది. టీచరు. చక్కటి నవ్వు. ఎప్పుడూ బ్యాంకుకి తనే వస్తుంది. చెక్కులిచ్చినా, పాసు పుస్తకం ఇచ్చినా ప్రేమలేఖల్లా అనిపించేవి.

"థేంక్సండీ. పర్మిషన్ పెట్టి రావాల్సి వచ్చింది. మా స్కూలు ఇక్కడే. స్కూల వతల బస్టాపు మాది. కన్వీనియంటుగా ఉంది. నాలుగున్నరకల్లా బైట పడుతుంటాను. థేంక్యూ."

ఆమె వెళ్లిపోగానే కౌంటరవతల ప్రపంచం ఖాళీగా కనిపిస్తుంది. రోజూ ఏదో ఒక పనిమీద సుగుణ వచ్చివెడుతుంటే ఎంత బావుంటుంది. నిట్టూర్చేడతను. సన్నగా నాజూగ్గా తీగలా ఉండేదిగాదు సుగుణ. పొడుగూ పొట్టీ కాకుండా చిరుబొద్దుగా ఆకర్షణీయంగా ఉండేది. గాలికి కొంచెం కదుల్తున్న చేతిలో పేపరు సుగుణలా అనిపించింది క్షణం. అనేకసార్లు బ్యాంకుకి వచ్చి వెళ్లేదామె. స్నేహితులతో ఎఫ్.డి. గురించీ, ఆమె అడిగే సందేహాలు, వివరాలూ బ్యాంకుకి రాకుండానే తెలుసుకునేవేనని వరదాచార్యులకి అనిపించలేదు. ఎకౌంటెంటుగారికి అనిపించింది. లంచి చేస్తూ వరద ఒక్కడే ఉండడంచూసి బాక్సు తీసుకుని ఎదుట కుర్చీలో కూచున్నాడాయన.

"ఏం కూర వరదా?"

"దోసకాయ. మా అమ్మ స్పెషల్!"

"అవునూ. ఇందాక ఎఫ్.డి. ఫారాలు ఎవరికీ అడిగేవు?"

"అదా టీచర్‌గారికి. ఎక్కడ లేని అనుమానాలు ఆవిడికే."

అతనివైపు చూస్తూ అడిగాడు ఎకౌంటెంటు, "నాకు తెలీకడుగుతాను. నిజంగా ఆమెకేవీ తెలీకే అడిగిందంటావా?"

"గురూగారూ, తెలిస్తే బ్యాంకు వరకు కాళ్లీడ్చుకుంటూ ఎందుకొస్తుంది?"

"వస్తుంది. నీకు బుర్ర లేదని తెలిసేవరకూ వస్తూనే ఉంటుంది."

"ఊరుకోండి సార్."

తరువాత మూడు నిమిషాలు మాట్లాడేడు ఎకౌంటెంటుగారు.

"ఏం, వైష్ణవులు కాకపోతే కొంప మునుగుతుందా?"

"నా కదేం లేదు."

వరద అనేక రాత్రులు ఆలోచించాడు. కొన్ని నెలల తరువాత అన్నాడతను.

"గురూగారూ, మీరే కరెక్టు."

"గో ఎహెడ్. శుభం."

వరదగారికి పేపరు మీద కోపం వచ్చింది. విసురుగా మడిచి పక్కన పడేశాడు. సుదూర ప్రయాణంలో కనిపించిన ఒకే ఒక మైలురాయి సుగుణ. మరచిపోలేదు. ఎన్ని బ్యాంకులు మారలేదు? మేనేజర్ అయినా క్యాషియరైనా అందరిపనులూ తనే చేశాడు. రిటైరై ఇంటికొచ్చిపడ్డ తరువాత కొన్ని విషయాలు అతనికి అర్థమైనాయి. గది ఇనుప్పెట్టెలా ఉంది.

లంచి ముందు ఏదో పనిమీద సుగుణ వచ్చి వెళ్లింది. వరద సంతోషంగా ఉన్నాడు. యూనియన్ సెక్రటరీ రాజు వచ్చేడు.

"నీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి," అన్నాడు.

కలిసి భోజనం చేశారు. చెయ్యి, బాక్సు రెండూ కడుక్కుని కౌంటర్లో కూచు న్నాడు వరద. రాజు మాటలు అతని రెండు చెవుల్లో నిండిపోయాయి. నాలుగంటలకి ఎకౌంటెంటుగారు వెనక వరండాలో సిగరెట్టు కాలుస్తూ నిలబడ్డాడు. వరద ఆయన దగ్గరికి వెళ్లి నుంచున్నాడు.

"వ్యవహారం బాగా నడుస్తున్నట్టుంది," అన్నాడాయన.

"ఆహా. ఈ కొత్త వ్యవహారం గురించే."

"ఏమైంది?"

"ఇందాక రాజు వచ్చి ఓ ప్రపోజలు పెట్టేడు. ఇరుక్కుపోయాను."

"ఇంకేం? ఎలక్షన్లు వస్తున్నాయిగా. మళ్లీ నిలబడుతున్నాడు. నువ్వు బాగా దొరికేవు. ఏవంటాడు?"

"ఓ మూడు నెలలు ఏలూరు వెళ్లమంటున్నాడు."

"వాట్! కొంప ముంచేడు పో."

"వెంటనే వెనక్కి లాక్కొస్తానంటున్నాడు."

"అర్థమైంది. అక్కణ్ణించి కృష్ణారావుని ఇక్కడికి తెస్తాడు. అవునా? ఎలక్షన్లవగానే వెనక్కి వద్దువుగాని అంటాడు. అంతా రాజకీయం. ఊ నువ్వేం చెప్పేవు?"

"యూనియన్ సెక్రటరీకి ఏం చెప్తాను?"

''చెప్పొచ్చుగానీ, నీ వల్లగాదులే. గుడ్ లక్.''

వరద కళ్లు మూసుకున్నాడు. బనీను మీద గుండె ప్రాంతంలో ఐసు ముక్కలు. కళ్లు తెరవగానే మంచుతెరల మధ్య పెళ్లిఫొటో కనిపించింది. బెజవాడ వదలడం ఇష్టంలేదు తనకి. చటుక్కున కళ్లు తెరిచాడతను. ఆ రాత్రి ఆలోచించాడతను. బ్యాంకులో మర్నాడు కూడా పనిచేస్తూ ఆలోచించాడు.

రాత్రి మళ్లీ ఆలోచించాడు. బెజవాడ వదిలిపోవడం తనకిష్టం లేదని తేలి పోయింది. ఎందుకు ఇష్టం లేదు? కౌంటరవతల పలకరింపుగా నవ్వుతున్న సుగుణ. సాయంకాలం ఇంటికెళ్లకుండా పార్కుకి వెళ్లి కూచున్నాడు వరద. జనం ఎక్కువ లేరు. చెట్టుకింద బెంచీ చూసుకుని బయటకొన్న వేరుశనక్కాయల పొట్లం విప్పేడతను. నాలుగ్గింజలు తినగానే కమ్మటి రుచి అతన్ని ఆవహించింది. చీకటి పడుతుండగా జనం ఎక్కువయ్యేరు. బరువు దించుకోడానికి కొంతమంది వేగంగా నడుస్తున్నారు. తను లావుగాదు. సన్నం కూడా కాదు. ఎక్కువ బరువులేడు. కానీ ఏదో బరువు వీపుకి అతుక్కుపోయింది. మొత్తం పార్కులో తను ఒక్కడే ఉన్నట్టనిపిస్తోంది. ఒక్కో వేరుశనగ గింజా నోట్లో పడుతోంది. హఠాత్తుగా ఏవీ రుచిగా అనిపించడంలేదు. మరో రెండు గింజలు తిన్నాడతను. ఏవీ బాగాలేవు. గింజలు ఉమ్మేశాడతను. పొట్లం కట్టి పక్కన చెట్టు కిందికి విసిరేశాడు వరద. అటూ ఇటూ చూశాడతను. తనకి దూరంగా నాలుగు బెంచీలవతల ఇద్దరు అస్పష్టంగా కనిపించారు. అబ్బాయి, అమ్మాయి. వాళ్లకే తను కనిపిస్తాడు. అతుక్కుపోయి కూచున్నారు. అమ్మాయి తల అబ్బాయి భుజంమీద అంటుకుని ఉంది. అటువైపు ఉన్నవాళ్లకీ, అటూ ఇటూ వెళ్లేవాళ్లకీ అందరికీ కని పిస్తూనే ఉన్నారు. జాగ్రత్తగా పరికించి చూశాడు.

ఇద్దరి చేతులూ అమ్మాయి ఒళ్లో ఉన్నట్టున్నాయి. వాళ్లిద్దరికీ సంబంధించి నంతవరకు పార్కులో వాళ్లిద్దరే ఉన్నారు. మిగతా వాళ్ల రాకపోకలు వాళ్లిష్టం. కాసేపటికి వాళ్లు అస్పష్టంగా కూడా కనిపించడం లేదు. తను వెళ్లి ఎదురుగా నుంచున్నా వాళ్లు పట్టించుకోరు. ఎవర్నీ పట్టించుకోరు, ఎదురుగా ఉన్నా, దూరంగా ఉన్నా. వరదకి శరీరం భారంగా అనిపించింది. కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరేడతను.

ఏలూరు వెళ్లేడు. కృష్ణారావు ఖాళీ చేసిన గదిలో చేరేడు. గది పెద్దగా నచ్చలేదు. బాగానే ఉంది. కొన్ని నెలల వరకు ఫరవాలేదు. కొన్ని నెలల తరువాత అంత బాగా లేకపోయినా మాత్రం ఏమిటి? బాగా లేకపోవడం అలవాటైపోతుంది. ఏదైనా అతనికి ఏలూరు నచ్చలేదు. ఐదు నెలల తరువాత రాజు ఫోన్ చేశాడు.

''సారీ బాస్. తెనాలి వెళ్తావా? మంచి ప్లేసు. తరువాత ఇక్కడికే.''

తెనాలిలో దరిదాపు ఏడాది ఉండిపోయాడు. రాజు ఎన్నికల్లో ఓడిపోయాడు. అప్పటికే వరదకి బెజవాడ మీద ఆశ పోయింది. తెనాలి బాగుందో లేదో అతనికి

తెలీలేదు. మరో ఆరునెలల తరువాత వరద కిళాంబివారి అమ్మాయిని చేసుకున్నాడు. అమ్మ నిజమే చెప్పింది. సన్నగా, తెల్లగా ఉంది. పెళ్లికి ముందు ఎకౌంటెంటుగారికి ఫోన్ చేశాడు.

"గురూజీ, మీ పరీక్షలో ఫెయిలయ్యేను."

"అది నీ పరీక్ష. నువ్వు ఫెయిలవడం మొదలుపెట్టి చాలా కాలమైంది."

మూడేళ్ల తరువాత మళ్లీ ఏలూరు బదిలీ అయ్యేడు వరద. తరువాత కంకిపాడు. అక్కడుండగానే ఒకసారి ఎకౌంటెంటుగారు శంఖ, చక్రధారి అయిన సాక్షాత్తూ శ్రీమన్నారాయణమూర్తిలా అనిపించాడతనకి. ఏలూర్లో ఉన్నాడాయన. రాత్రి ఎనిమిదవుతుండగా ఆయనింటికి వెళ్లేడు.

"నిద్రా, మెలకువా? బోయినం వడ్డించాను," భార్య పిలుపుతో ఇహంలో కొచ్చాడు వరదాచార్యులు.

పేపరు పక్కన పడేసి లేచి కూచున్నాడు.

అప్పుడే భోయినాల వేళయిందా? నడవ బుద్ధవలేదతనికి. చిన్న టేబులుంది. ఇక్కడే అన్నం తినొచ్చు. ('మడీ తడీ ఉంటేగా మీకు?') చిన్నచిన్న పనులకి ఓ కుర్రాణ్ణి పెట్టుకోవాలసలు. లుంగీ పైకి ఎగ్గట్టి నుంచున్నారు వరద. తప్పనిసరి, కొంతశ్రమ, ఒక నిర్ణయం ఇప్పుడాయన్ని భోజనాల బల్లవైపు నడిపించేయి.

"ఆ నారాయణ తైలం అయిపోయింది. తెప్పించమంటే విన్నారు కారు."

"విన్నాను. మరచిపోయాను. ఇవాళ తెప్పిస్తాను."

"కీళ్లు నాక్కూడా అరిగిపోయేయని మరచిపోకండి. చెయ్యలేక ఛస్తున్నాను. హాయిగా నడుం వాల్చి పేపరు చదూకోడంగాదు."

తీరిగ్గా, మెల్లిగా, లేస్తే నడవాలనే భయంతో భోజనం ముగించాడు వరదాచార్యులుగారు. ఇంక లేవక తప్పదు. టేబుల్ చివర నీలం సీసా. ఏదో నీలపు ఊరట కాస్త. కొంచెం ఉపశమనం అన్నాడు డాక్టరు.

"కూచోండి. కాస్త రష్ తగ్గితే మీతో తీరిగ్గా మాట్లాడొచ్చని ఆలస్యం చేశాను. ఎలా ఉన్నారు?"

"ఎలా ఉంటాను సార్? బాగుండే అవకాశం ఏముంది? ఆపరేషన్ మంచిదంటారా?"

"ఏం మళ్లీ ఊళ్లు తిరగాలని ఉందా?"

"నేను ఇష్టపడి ఏ ఊరు వెళ్లలేదు."

"మన నిమిత్తం లేకుండా అనేకం జరుగుతాయి ఆచార్లుగారూ. నిజానికి మోకాళ్ల నొప్పులున్నా సుఖంగా ఉండొచ్చు."

"మోకాళ్లు అరిగిపోయిం తరువాత సుఖవేవిటి డాక్టరుగారు."

"మోకాళ్లు అరుగుతాయి. ఒక్కోసారి గుండె మొరాయిస్తుంది. ఇవేవీ సుఖంగా ఉండవు. కానీ సార్, వీటన్నింటినీ శరీరానికే వదిలెయ్యాలి. ఇబ్బందులుండ వనడంలేదు. నొప్పిని నొప్పిగా ఈ శరీరానికి సంబంధించినదిగా తీసుకోవాలి. మీకు మోకాళ్లు నొప్పులున్నా మీ మనవడు ఫోన్ చేస్తే అన్నీ మరచిపోతారా లేదా?"

"అది వేరు."

"రైట్. అది వేరు. ఇది వేరు. అదే చెప్తున్నాను. మనం దేన్ని ఎలా ఎంతవరకు చూడాలో నేర్చుకోం వరదగారూ. నొప్పిగా ఉందని పులిహోర తినడం మానేశారా? పార్కుకి వెళ్లడం మానేశారా? ఈ జీవితం కంటే మోకాళ్లు నొప్పులు గొప్పవా?" డాక్టరు గారు మెత్తగా నవ్వేరు.

వరదకి అదంతా వినడానికి బావుంది. ఇంటికొచ్చి రాత్రి ఆలోచించాడతను.

మోకాలి నొప్పులతో సుఖంగా ఉండడం అర్థంలేదని అతనికి అర్థం అయ్యింది. చటుక్కున సుగుణ జ్ఞాపకం వచ్చింది. సుగుణ భర్తకి మోకాళ్ల నొప్పి ఉందా? భర్త మోకాళ్లకి నూనె రాస్తుంటుందా? కలుక్కుమంది మోకాలు. ఉఫ్!

మంచం మీద కాళ్లు పారేసి వెల్లకిలా పడుకున్నాడు వరదాచార్యులు. కాసేపాగి మళ్లీ పేపరు తీశాడు. నాలుగో పేజీలో బ్యాంకు దోపిడీ కనిపించింది. దోపిడీ చేసింది దొంగలు కాదు. క్యాషియరు. లాలూచీపడి వడ్డీలు కాజేశాడు. చలికి బిగుసుకు పోయాడు వరదగారు. లోపల్నించి చలి. శీతాకాలం అంతా తన శరీరంలోనే ఉన్న ట్టుంది.

ఆ రాత్రి ఎనిమిది దాటుతుండగా ఎకౌంటెంటుగారి తలుపు తట్టేడు వరద. ఆశ్చర్యపోయాడాయన.

"ఎక్కడి నుంచి?"

"కంకిపాడు నుంచి, కొంప మునిగింది."

ఎకౌంటెంటుగారింకా భోజనం చెయ్యలేదు. ఆయన గదిలో కూచుని చెరొక గుక్కా మింగిన తరువాతగానీ వరదకి నోరు పెగల్లేదు. అంతా విని అన్నాడు ఎకౌంటెంటు.

"ఒకరకంగా తెలివైనపనే. ఇంటరెస్టు మింగితే వెంటనే తెలీకపోయినా దొరికి పోవడం ఖాయం. బ్యాంకుని మోసం చెయ్యడం పెద్దవాళ్లకి మాత్రమే కుదురుతుంది. నిన్ను ఇరికించలేదు వాడు. నువ్వే వెళ్లి ఇరుక్కుపోదువూ. చిక్కుల్లో పడ్డం నీకు వెన్నతో పెట్టిన విద్య."

బిఎమ్‌గారికి వరద గురించి తెలుసు. ఎకౌంటెంటుగారొచ్చి బిఎమ్ గారితో మాట్లాడి, తంటాలుపడి వరదని బయటపడేశారు. మూడు నెలలు పట్టింది. ఎకౌంటెంటుగారి రెండు చేతులూ పట్టుకుని ఏడిచినంత పనిచేశాడు. జాగ్రత్తగా


ఉండమని చెప్పి వెళ్లిపోయాడాయన. తను ఎప్పుడూ జాగ్రత్తగానే ఉంటాడు. పని జాగ్రత్తగా చేస్తాడు. ఇతరుల పని అయినా జాగ్రత్తగా చేస్తాడు. మరి జాగ్రత్తగా లేకపోవడం ఏమిటి?

మోకాలు కలుక్కుమంది అమ్మో! మరచిపోయి కాలుమీద కాలు వేసుకున్నాడు వరదగారు. కలుక్కుమంది. మోకాలు చేత్తో రాసుకుంటూ ఉండిపోయాడాయన. అసలీ శీతాకాలం లేకుండా ఉంటే బాగుండును. కాలుమీద కాలు వేసుకోవద్దన్నాడు డాక్టరు. కావాలని ఎందుకు వేసుకుంటాడు? కావాలని కొన్ని చేద్దావనుకున్నాడు. ఎప్పుడో సివిల్స్ రాద్దామనుకున్నాడు. అంతే. ఉత్తచేత్తో మోకాలు రుద్దుకుని ఏం లాభం? బాగా నొప్పిగా ఉంది. అట్లా ఉన్నప్పుడు నీలంసీసాలో మందు కొంచెం రాసుకుని చూడండి అన్నాడు డాక్టరు.

తప్పదు. డైనింగు టేబుల్ మీద నీలంగా కూచుందది. రెండు కాళ్లూ జాగ్రత్తగా మంచం మీంచి దించి మెల్లిగా లేవడానికి ప్రయత్నించాడు వరద. కలుక్కుమంది మోకాలు. చటుక్కున కూచుండిపోయాడతను. మళ్లీ మోకాలు రాసుకుంటూ పెదాలు బిగించాడు. తలెత్తి డైనింగ్ టేబుల్ వైపు చూశాడు. పదిహేను పదహారు అడుగుల దూరంలో నీలంసీసా ఉంది. ఉపశమనం, సుఖం. అక్కడివరకూ వెళ్లాలి. ఈ కలుక్కుమనడం లేకపోతే టేబుల్ దగ్గరికి వెళ్లి ఉండేవాడు. మళ్లీ చూసేసరికి డైనింగ్ టేబుల్ చాలా దూరంగా కనిపించింది. లేచి వెళ్లాలి. మోకాలు రాసుకుంటూ అలాగే నీలంసీసావైపు చూస్తున్నాడతను.

*నవ్య వారపత్రిక*
*21 మార్చి 2018*

✻



**తల్లావఝల పతంజలి శాస్త్రి** 14 మే 1945న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ సీతన్న తాట 1962లో ఆంధ్రప్రభలో అచ్చయింది. మూడు కథాసంపుటాలు- వడ్ల చిలకలు, పతంజలి శాస్త్రి కథలు, నలుపెరుపు; మూడు నవలలు, నాలుగు నాటకాలు, భమిడిపాటి కామేశ్వరరావుగారి సంక్షిప్త జీవితచరిత్ర, ఒక కవితా సంపుటి ప్రచురించారు. ఆర్కియాలజీ చదివి, పర్యావరణ కార్యకర్తగా స్థిరపడి ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ సెంటర్ అధ్యక్షులుగా ఉన్నారు.

***చిరునామా: 86-4-16/1, వాడ్రేవునగర్, రాజమండ్రి - 533003, తూ.గో. జిల్లా***
***ఫోన్: 94407 03440 Email: ec_india@yahoo.com***